క్లుప్తంగా

లైవ్ సర్టిఫికెట్ల జారీకి ప్రత్యేక క్యాంపులు

బెల్లంపల్లి: ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పెన్షన్‌దారులు డిజిటల్ లైవ్ సర్టిఫికెట్ పొందడానికి ప్రత్యేకక్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు బెల్లంపల్లి సబ్ డివిజనల్ పోస్టల్ అధికారి ఆర్.విక్రమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ సంవత్సరం నవంబర్ నెలలో డిజిటల్ లైవ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని 60పోస్టాఫీసుల్లో క్యాంపులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అవకాశాన్ని పెన్షన్ దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందుకోసం డివిజన్‌వ్యాప్తంగా ముందస్తు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజేందర్, పీడీ తిరుపతి తెలిపారు. ఈ నెల 6న ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో జరిగిన జోనల్ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో అండర్ 17విభాగంలో ఈ.సాయికుమార్, ఎస్.హర్షిత్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. 8నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

జోనల్‌స్థాయి పోటీలకు..

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీల్లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మతిన్, రక్షిత్, ధనూష్, శ్రావణి, మనస్విని ప్రతిభ కనబరిచి జోనల్‌స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం సుదర్శన్, పీడీ రోజీవరకుమారి తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. 11న తాళ్లపేట ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎర్రగుంటపల్లిలో 'కమ్యూనిటీ కాంటాక్ట్'



మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రగుంటపల్లిలో గురువారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సీఐ శశిధర్ రెడ్డి, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద ప్రదేశాల్లో నార్కోటిక్ డాగ్‌తో పరిశీలించారు. ధ్రువపత్రాలు లేని 36వాహనాలను, ఒక ఆటోను సీజ్ చేశారు. నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. యువత గంజాయ్, మద్యం, గుట్కాలకు అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మందమర్రి ఎస్సై రాజశేఖర్, కాసిపేట ఎస్సై ప్రవీణ్, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణంపై విద్యార్థులకు క్షేత్రస్థాయి అవగాహన



అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట జెడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులకు పర్యావరణంపై తాళ్లపేట అటవీశాఖ అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. జన్నారం అటవీ డివిజన్‌లోని గోండ్‌గూడ బేస్‌క్యాంపు పరిధిలోని బర్డ్‌వాక్, అడవిలోని గడ్డి మైదానాలను, జన్నారం డివిజన్ కేంద్రంలోని బటర్‌ఫ్లై గార్డెన్‌ను విద్యార్థులకు చూపించి, వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాళ్లపేట ఎఫ్‌ఆర్‌వో సుష్మారావు, డీఆర్‌వో సాగరిక, సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



తల్లీబిడ్డతో అంబులెన్స్ సిబ్బంది

తాండూర్: కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం చోపిడి గ్రామానికి చెందిన ఆత్రం భీమ్‌భాయి అనే గర్భిణీని గురువారం బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రెబ్బెన 108అంబులెన్స్‌లో తీసుకెళ్తున్నారు. మార్గమధ్యలో తాండూర్ మండలం బోయపల్లి గ్రామం వద్ద పురిటినొప్పులు అధికం కావడంతో అంబులెన్స్‌ను రోడ్డు పక్కకు ఆపి ఈఎంటీ పరశురాం, పైలెట్ సంతోష్ కాన్పు చేశారు. భీమ్‌భాయి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారు.

'కరెంట్'.. కలవరం

- అవగాహన లేక పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు
- సొంతంగా మరమ్మతులు, నిర్లక్ష్యమే కారణాలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



బెల్లంపల్లిరూరల్: ఇటీవల కాలంలో విద్యుత్ ప్రమాదాల సంఖ్య పెరిగిపోతోంది. విద్యుత్ ఘాతానికి గురై నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. కరెంట్‌ను తక్కువగా అంచనా వేయడం కూడా ఈ ప్రమాద మరణాలకు మరో కారణంగా చెప్పుకోవచ్చు. కొన్ని చోట్ల నిర్లక్ష్యం, మరికొన్ని చోట్ల అత్యుత్సాహం, కొన్నిసార్లు ప్రమాదాన్ని గుర్తించకపోవడంతోనే మరణాలు పెరుగుతున్నాయి. ఒకింత ఏమరపాటు నిండు ప్రాణాలను బలిగొంటోంది. చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాలను రోడ్డున పడేస్తోంది. కొన్నిసార్లు అతి నమ్మకం ఆపదపాలు చేస్తోంది. విద్యుత్‌తో చెలగాటం ప్రాణ సంకటం అని తెలిసినా పట్టింపు లేని తనంతో కొందరు ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఏటా పెరుగుతున్న విద్యుత్ ప్రమాద మరణాలు తీవ్ర కలవరపాటుకు గురి చేస్తున్నాయి. ఏది ఏమైనా విద్యుత్ మరణాలతో ఆ వ్యక్తి కుటుంబం దిక్కులేని పరిస్థితిలో పడిపోతుంది.

అప్రమత్తతే శ్రీరామరక్ష....

విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ఉండాలంటే అప్రమత్తంగా వ్యవహరించడమే సరైన మార్గం. చిన్నపాటి జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాన్ని నివారించవచ్చు. విద్యుత్ వల్ల జరిగే ప్రమాదాన్ని అంచనా వేయడంతో పాటు ప్రమాద కారకాలను గుర్తించడం కూడా ప్రధానమే. ముఖ్యంగా ఇటీవల కాలంలో జరుగుతున్న గృహ సంబంధిత విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి సరైన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ప్రతి ఇంటికీ విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ వైర్‌ను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలి.
- తప్పనిసరిగా ఎర్త్ వైరింగ్ ఉండేలా చూసుకోవాలి.
- ప్రమాదం జరిగినప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోయేలా ఆటో కట్ ఆఫ్ స్విచ్‌ను మెయిన్ బోర్డులో అమర్చుకోవాలి.
- సాధ్యమైనంత వరకు విద్యుత్ మరమ్మతు చేసేటప్పుడు రబ్బర్ గ్లౌజ్‌లు వాడాలి.
- తడిచేతులతో స్విచ్‌లు ఆన్ ఆఫ్ చేయడం లాంటివి చేయకూడదు.
- విద్యుత్ సరఫరాలో చిన్న లోపాలను గుర్తించినప్పుడు సొంతంగా మరమ్మతు చేయకుండా, తప్పనిసరిగా నిపుణుల సహాయంతోనే మరమ్మతు చేయించుకోవాలి. ఇలాంటి చిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా విద్యుత్ ప్రమాదాలను శాశ్వతంగా నివారించవచ్చు.

ఇటీవల జరిగిన ఘటనలు..

- గత నెల 22న మందమర్రి సెకండ్ జోన్‌కు చెందిన గొగ్గుల సత్యాన్వేష్(22) ఇంటి ఆవరణలో బట్టలు ఆరవేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు.
- జూన్ 30న బెల్లంపల్లి మండలం బుధాకుర్దు గ్రామంలో రిటైర్డు సింగరేణి కార్మికుడు మేడం పోశమల్లు (70) ఇంటి ఆవరణలో విద్యుత్ తీగలు సవరిస్తున్న క్రమంలో విద్యుత్ ప్రమాదానికి గురై అక్కడికక్కడే మరణించాడు.
- ఏప్రిల్ 23న అర్ధరాత్రి సమయంలో బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల గ్రామానికి చెందిన బొమ్మగాని అనిల్‌కుమార్ గౌడ్(28) ఉక్కపోతతో ఇంట్లోని కూలర్ వైర్‌ను జంక్షన్ బాక్స్‌లో అమర్చే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.
- ఏప్రిల్ 17న కాసిపేట మండలం కోమటిచేనుకు చెందిన బెడ్డల మౌనిక(28) ఇంటి పైన ఉన్న వాటర్ ట్యాంక్‌లో నీటిని పరిశీలించేందుకు వెళ్లి తెగి పడి ఉన్న విద్యుత్ వైర్ తగిలి అక్కడికక్కడే మరణించింది.

అవగాహన ఉండాలి

ప్రజలు విద్యుత్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలి. ప్రమాదాలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు పాటించాలి. ఇళ్లలో విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు స్వతహాగా మరమ్మతు చేయకుండా విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. తద్వారా విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చు. గ్రామాల్లో ప్రమాదాలు జరగకుండా అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్.రాజశేఖర్, ఏడీఈ విద్యుత్ శాఖ, బెల్లంపల్లి

'ఎఫ్‌టీఎల్ భూములు కొనొద్దు'



చెరువు భూమిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ

లక్సెట్టిపేట: ప్రజలు చెరువుల శిఖం, ఎఫ్‌టీఎల్ భూములు కొనుగోలు చేయొద్దని ఇరిగేషన్ డీఈ కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గంపలపల్లి గ్రామ శివారు చెరువు భూములను గురువారం పరిశీలించారు. చెరువుల చుట్టూ ఉన్న ఎఫ్‌టీఎల్, శిఖం, బఫర్ భూములను కొనుగోలు చేస్తే ఇబ్బంది పడుతారని, ఆ భూములను కొనొద్దని సూచించారు. చెరువుల విస్తీర్ణాన్ని త్వరలోనే కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇరిగేషన్ ఏఈ మహేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

తాండూర్: ప్రభుత్వ గురుకుల విద్యాలయాలు, వసతిగృహా విద్యార్థుల డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచడంపై గురువారం తాండూర్ మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల విద్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడానికి సీఎం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ.ఈసా తదితరులు పాల్గొన్నారు.

పులి స్వేచ్ఛకు భంగం కలిగించొద్దు

కోటపల్లి: కోటపల్లి అటవీ రేంజ్ పరిధిలో పులి స్వేచ్ఛకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎఫ్‌ఆర్వో సదానందం అన్నారు. గురువారం కోటపల్లి రేంజ్ కార్యాలయంలో పులిదాడిలో పశువులు మృతిచెందిన యజమానులు మధునక్క, రామయ్యకు నష్టపరిహారం అందజేశారు. ఎఫ్‌ఆర్వో సదానందం మాట్లాడుతూ ఫారెస్టు పరిధిలో పులి వచ్చే అవకాశాలు ఎక్కువ ఉన్నందునా పశువుల యజమానులు అటవీ ప్రాంతంలో మేపడానికి వెళ్లవద్దన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు రాజేందర్, నరేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంపొందించడంలో మీడియా నిర్వహించిన పాత్ర గుర్తించి అవార్డులు అందజేయనున్నట్లు కలెక్టర్ కుమార్‌దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024సంవత్సరం ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, రేడియో మీడియా, ఆన్‌లైన్(ఇంటర్నెట్), సోషల్ మీడియా ప్రతినిధులకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అవార్డు ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు. జిల్లా పరిధిలో సంస్థలు, ప్రతినిధులు తాము చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, శిబిరాల వివరాలతో నామినేషన్లు సమర్పించాని, ఈ నెల 25న రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపిస్తామని పేర్కొన్నారు.

వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

లక్సెట్టిపేట: వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని ఐసీటీసీ సీపీఎం నీలిమ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సబ్‌జైల్‌లో అండర్ ట్రయల్ ఖైదీలకు ఐసీటీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. జైలర్ స్వామి, వైద్యాధికారి శ్రీనివాస్, ఐసీటీసీ కౌన్సిలర్ అంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహణ

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి కలిగించటానికి, సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు గురువారం పాఠశాల స్థాయిలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 8, 9, 10విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో 5000కు పైగా విద్యార్థులు హాజరయ్యారని కన్వీనర్ ఎడ్ల కిష్టయ్య తెలిపారు. నవంబర్ 21న మండలస్థాయి, 28న రాష్ట్రస్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు.

సంక్షిప్త వార్తలు

కోలుకున్న విద్యార్థినులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలకు చెందిన 12మంది విద్యార్థినులు ఫుడ్ పాయిజన్‌తో బుధవారం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేరగా, 11మంది విద్యార్థినులను డిశ్చార్జి చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్రరెడ్డి తెలిపారు. బుధవారం నలుగురు విద్యార్థినులు, గురువారం ఏడుగురు విద్యార్థినులను డిశ్చార్జి చేయగా, ఒకరు మాత్రం నీరసంగా ఉండడంతో అబ్జర్వేషన్‌లో ఉంచినట్లు తెలిపారు.

కులగణనలో మాదిగలు జాగ్రత్తగా ఉండాలి

చెన్నూర్: ప్రభుత్వం చేపడుతున్న కులగణనలో మాదిగలు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్ అన్నారు. కులగణన సర్వే కోసం ఇంటికి వచ్చే అధికారులకు మాదిగలు ఎస్సీ అని, ఉప కులం ఉండే కాలంలో మాదిగ అని రాయించాలన్నారు.

కులగణన సర్వే సమగ్రంగా నిర్వహించాలి

వేమనపల్లి/కాసిపేట/భీమారం: సమగ్ర ఇంటింటి సర్వే సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులు సూచించారు. ఎన్యూమరేటర్లకు గురువారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాల్లో వేమనపల్లిలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ రమేశ్, కాసిపేటలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్, తహసీల్దార్ భోజన్న, భీమారంలో తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో మధుసూదన్, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

కాసిపేట: కుమురంభీం జిల్లా వాంకిడి మండలంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 64మంది విద్యార్థులు అనారోగ్యానికి గురైనందునా సంబంధిత డీటీడీవో, ఏటీడీవో, హెచ్‌ఎం, వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కాసిపేటలో గురువారం వారు మాట్లాడుతూ.. తక్షణమే వారిని సస్పెండ్ చేయాలన్నారు. అంత పెద్ద సంఘటన జరిగి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 12మంది విద్యార్థులు సాధారణంగా అనారోగ్యానికి గురైతే డీటీడబ్ల్యూవో గంగారాంను సస్పెండ్ చేయడం దారుణమన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

దండేపల్లి: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం.. మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన సల్ల రాకేష్(24) ఖాళీగా ఉండేవాడు. దీంతో కుమారుడిని తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన అతడు ఈ నెల 2న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ బుధవారం అర్ధరాత్రి చనిపోయాడు. మృతుడి తండ్రి భీమన్న ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిరుపేద కుటుంబానికి అండ

భీమారం: మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన వివాహిత మచ్చ లక్ష్మి ఇటీవల మృతి చెందగా భీమారం 'మహిళా వాట్సాప్ గ్రూప్' సభ్యులు అండగా నిలిచారు. రూ.30వేలు సేకరించి గురువారం లక్ష్మి కూతురు అమ్ములు పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి బాండుపేపర్‌ను బాధిత కుటుంబానికి అందజేశారు.

వరి కోతలపై రైతులకు అవగాహన

భీమారం: వరిపంట కోతలపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏవో సుధాకర్ గురువారం మండలంలోని పోతన్‌పల్లిలో అవగాహన కల్పించారు. కోత సమయంలో హార్వెస్టర్‌లో 18ఆర్‌పీఎం పెట్టి మిషన్ నడపాలని ఆపరేటర్లను ఆదేశించాలన్నారు. బ్లోయర్ వేయాలని కోరారు. దీనివల్ల ధాన్యంలో దుమ్ముతో పాటు తాలు కూడా పోతుందన్నారు.

హాజీపూర్‌లో ప్రమాద స్థలాల పర్యవేక్షణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని జాతీయ రహదారి 63పై నిత్యం జరుగుతున్న ప్రమాదాలను నివారణకు గురువారం ఎన్‌హెచ్ఏఐ, రవాణా, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా జాతీయ రహదారి పర్యవేక్షణ చేపట్టారు. ముల్కల్ల బస్టాండ్, ముల్కల్ల బ్రిడ్జి, వేంపల్లి గ్రామ పంచాయతీ సమీపంలో ప్రమాదాలు జరుగుతున్నట్లు నిర్ధారణకు వచ్చారు. ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తూ వాహనదారులను అప్రమత్తం చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు నిర్ణయించారు. ఎంవీఐ కిషోర్‌చంద్రారెడ్డి, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా డీఈ జగదీశ్, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

శ్రీరాంపూర్: రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ సూచించారు. శ్రీరాంపూర్ స్టేషన్ పరిధిలోని ఎన్‌హెచ్ 63పై ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్‌లను ఎన్‌హెచ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రమాదాల నివారణ కోసం పలు సూచనలు చేశారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జన్నారం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందని, ఇందుకోసం గ్రామాల్లో వైద్య ఆరోగ్య ఉప కేంద్రాలను ఏర్పాటు చేసి పక్క భవనాలు నిర్మిస్తున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని ధర్మారం గ్రామంలో గురువారం రూ.20లక్షలతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం పనులను ఆయన ప్రారంభించారు. ఇందన్‌పల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, కేంద్రం వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, పీఏసీఎస్ చైర్మన్ రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజశేఖర్, ఇసాక్, లక్ష్మీనారాయణ, ముత్యం రాజన్న, మాణిక్యం, ఫసీఉల్లా, ఇందయ్య, కరుణాకర్, గంగాధర్, సతీశ్‌కుమార్, శాకీర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ ద్వారా పత్తికి మద్దతు ధర



పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వినోద్

తాండూర్: సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టడం ద్వారా రైతులకు మద్దతు ధర లభిస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మండలంలోని రేపల్లెవాడ శివారులోని జిన్నింగ్ మిల్లులో గురువారం సీసీఐ అధికారులతో కలిసి పత్తి కొనుగోళ్లను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇద్దరు యువ పత్తి రైతులు ప్రసాద్, రాములును శాలువాతో సన్మానించి మాట్లాడారు. నాణ్యత కలిగిన పత్తికి ప్రభుత్వం క్వింటాళ్‌కు రూ.7,521మద్దతు ధర ప్రకటిస్తున్నట్లు తెలిపారు. వ్యాపారులు, దళారులకు పంట అమ్ముకొని నష్టపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరిధాన్యం, పత్తి కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా, ఏ సమస్య వచ్చినా నేరుగా తనను సంప్రదించాలని రైతులకు సూచించారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని కితాబు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దీన్, సంబంధిత అధికారులు, జిన్నింగ్ మిల్లు యాజమాన్యం, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్టాపనకు ఎంపీ, ఎమ్మెల్యేల హాజరు



విందుభోజనం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ 9 వార్డు పరిధి రైల్వే స్టేషన్ ఏరియాలోని దుర్గామాత ఆలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమానికి గురువారం రాత్రి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరయ్యారు. ప్రజాప్రతినిధులకు బస్తీ వాసులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం దుర్గామాత దేవాలయంలో ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ప్రగతి జూనియర్ కళాశాలలో నిర్వహించిన గ్యార్మీ పండుగ వేడుకలకు ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. సహపంక్తి భోజనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళ కాంగ్రెస్ నాయకురాళ్లు, భక్తులు, ముస్లిం మతపెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఫుట్‌బాల్ విజేతకు అభినందన



క్రీడాకారులతో జీఎం సూర్యనారాయణ

శ్రీరాంపూర్: ఇటీవల మందమర్రిలో జరిగిన కంపెనీ లెవెల్ ఫుట్‌బాల్ ప్రథమ స్థానం సాధించిన శ్రీరాంపూర్ జట్టును ఏరియా జీఎం సూర్యనారాయణ అభినందించారు. జీఎం కార్యాలయంలో గురువారం జట్టు క్రీడాకారులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. క్రీడాకారులు కోలిండియా స్థాయిలో కూడా రాణించి పతకాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి షేక్ బాజీసైదా, ఇంచార్జ్ ఎస్ఓటుజీఎం శ్రీధర్ రావు, ఇందారం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఆర్కే న్యూటెక్ గని మేనేజర్ స్వామిరాజు పాల్గొన్నారు.

ఏజెంట్ రాయుడుకు వీడ్కోలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లో ఆర్కే 7గ్రూపు ఏజెంట్‌గా పనిచేసి ఎస్ఓటుజీఎంగా పదోన్నతిపై రామగుండం ఏరియాకు బదిలీపై వెళ్తున్న రాయుడును ఏరియా అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. జీఎం కార్యాలయంలో గురువారం జీఎం సూర్యనారాయణ ఆయన్ను శాలువాతో సత్కరించి ఆయన ఏరియాలో చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఓటు జీఎం శ్రీధర్‌రావు, ఇందారం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి ఏవీ రెడ్డి, శ్రీరాంపూర్ డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఆర్కే న్యూటెక్ గని మేనేజర్ స్వామిరాజు తదితరులు పాల్గొన్నారు.

'శ్రీరాంపూర్‌లో 1000 క్వార్టర్ల నిర్మాణం'

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో కార్మికుల కోసం నూతనంగా 1000క్వార్టర్లను కంపెనీ నిర్మించబోతుందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచీ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు నూతన క్వార్టర్లను నిర్మించాలని యూనియన్ నాయకత్వం సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిందన్నారు. యాజమాన్యం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

జీఎంను కలిసిన ఐఎన్టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణను ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన జీఎంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గురువారం ఆ యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో నాయకులు జీఎం కార్యాలయంలో జీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కలవేన శ్యాం, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, జాతీయ సమితి సభ్యులు భీంరావు, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతిరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

మందమర్రిరూరల్: సింగరేణి ఉద్యోగులకు ఆదాయ పన్నును రద్దు చేయాలని హెచ్‌ఎంఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. సింగరేణి కార్మికులను ప్రభుత్వాలు సైనికులుగా పొగిడారని, గత ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు ఆదాయ పన్నును రద్దు చేస్తామని వాగ్దానం చేసి మరిచారని గుర్తు చేశారు. వెంటనే ఆదాయ పన్నును రద్దు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. హెచ్‌ఎంఎస్ నాయకులు వెల్తి సుదర్శన్, సదానందం, రామస్వామి, థామస్, ముఖేష్ ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

దండేపల్లి: మండలంలోని ముత్యంపేట శివారులో సర్వే నం 17లో గల 34గుంటల ప్రభుత్వ భూమిని వరి కొనుగోలు కేంద్రానికి కేటాయించాలని స్థానికులు కొండా నరేష్, పలువురు రైతులు కోరారు. తహసీల్దార్ సంధ్యారాణికి గురువారం వినతిపత్రం అందించారు.